ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయిన కార్లోంచి ఆగకుండా పడుతున్న వాన జల్లుని చూస్తున్నాను. రోడ్డు తీరాన్ని ఒరిసి ప్రవహిస్తున్న వాననీళ్ళలో ఆచీ తూచి అడుగులు వేస్తున్న పాదాల పట్టీలు, మట్టెలు జిగేల్‌మని మెరుస్తూ కనిపించాయి. చూస్తే ఎవరు? లేత నీలం రంగు చీరలో దిగి వచ్చిన మేఘమాలికలా నీవు. ఎందుకో నీ పెదవులపై చిరునవ్వు మెరుస్తోంది. వాతావరణంలోని చల్లదనానికో, నిన్ను చిన్న బుచ్చకుండా ఉండడానికో మధ్యాహ్నం తీయడం మరిచిన నీ జడలోని పూలు సాయంత్రమైనా వాడనట్లే ఉన్నాయి. చేతుల్నిండుగా నీలం గాజులు, చినుకుల్నుండి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు అటూ ఇటూ ఊగే నీ వాల్జడ... వానలో తడవడం ఎంతో ఇష్టమైన నువ్వా హాయిని అనుభవిస్తూ అలాగే ఉన్నావు సుమా. నీవు ఒకరకంగా నడుస్తావు. ఆ నడకలో ఠీవితో కూడిన ఒయ్యారం ఉంటుంది. చూడ్డానికి చాలా బాగుంటుంది. చూస్తూ ఉండాలని ఉంటుంది. నువ్వు గిరుక్కున వెనక్కి తిరిగినప్పుడు నీ జడ తాచుపాములా మెలికలు తిరుగుతుంది. ఇదంతా నీకు తెలియని నీ అందం. అందుకే కలలా కదలిపోతున్న నిన్ను కదలని కారులోంచి కంటికి కనబడే దాకా అలా చూస్తుండిపోయాను.

ప్రజ్ఞా డియర్, ఫోన్లలో పలకరించుకోవడమేగాని ఉద్యోగం మారాకా ఈ అయిదేళ్ళలో నిన్నిదే చూడ్డం. ఎన్నో ఆలోచనలు. అక్షరరూపం ఇవ్వడానికి సమయం చాలడం లేదు. లోకంలోని గడియారాలన్నీ ఒక్కసారి ఆగిపోతే బావుండుననిపిస్తోంది. ఎంత జీవితంలాగే కాలాలు కూడా. ఎండా, వానా, చలి! దేన్నీ తప్పించుకోలేం. అప్పుడప్పుడు వీచే పిల్ల తెమ్మెరలు, వెచ్చని కోరికలు, వసంతాలు- ఇవే జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. ప్రేమ కోసం ఎంత మథన పడ్డానో నాకే తెలుసు. ఇందులేఖ నన్ను మురిపించి నట్లే మురిపించి వేరొకనికి భార్య అయింది. భ్రమర నా జీవితాన్ని చిందరవందర చేసేసింది.

నీవు కనబడగానే చల్లని గాలి నేరుగా గుండెను తట్టినట్లుగా ఉంది. నేను నీతో స్నేహం చేయడానికే పుట్టాననిపిస్తోంది. ఇవాళ ప్రకృతి స్త్రీత్వపు అందంలా ఉంది. చల్లగా, నిర్మలంగా, మేఘాల ఎత్తుపల్లాలతో ఆకాశం అచ్చం నవయౌవనిలా ఉంది. నా మేడ మీది కిటికీలోంచి చూస్తుంటే నీలిమేఘాల మధ్య జేగీయమానంగా వేలాడుతున్నట్లుంది బిర్లా మందిరం. ఎంత అందంగా ఉందో – ఎత్తయిన పయోధరాలపై వజ్రాల పతకంలా.

నేను చెడ్డవాడినని తిట్టుకుంటున్నావు కదూ! నేనే కాదు, ప్రతి మగాడూ ఆ మేరకు చెడ్డవాడే. నీలాంటి సహృదయ సన్నిహితుల దగ్గర దాపరికం లేకుండా నేను బైటపడతానంతే! చెడ్డవాణ్ణి కాదు, ప్రేమాన్వేషిని. పిచ్చివాణ్ణి.

ఒక మంచి స్నేహితురాలే కాదు, అద్భుతమైన ఓ స్త్రీ కూడా ఉంది నీలో. అందుకే నిన్ను ఊహల్లో అంతగా ప్రేమిస్తున్నాను. ఇది శాశ్వతమా? అశాశ్వతమా అనే మీమాంస నాకక్కరలేదు. శాశ్వతమెందుకు? వర్తమానంలో జీవిస్తాను. నీవేమన్నా నేను నీ ప్రేమికుడినే. ఏ భిక్షా పొందని ప్రేమ భిక్షగాణ్ణి. నన్ను నిస్సహాయుణ్ణి చేసే ఆకర్షణ కూడా ఆహ్లాదాన్ని, హాయిని ఇవ్వక మరింత శూన్యాన్ని కుమ్మరించి వెళ్తున్నాయి. గుండెలో వెలితి, మనసంతా ఎవరో తవ్వి పోసినట్లు? సఖీ, నాకు పీడ కలలు రావు. అందుకేనేమో మెలకువగా ఉన్నప్పుడు ఇంత భారంగా ఉంటుంది. అర్ధరాత్రి దాకా నిద్ర లేదు. అయిదు దాకా చీకటిని కౌగలించుకుని, నిశ్శబ్దాన్ని ఈదుతూ గడిపా.



చిత్రం: నర్సిం

# నీ బాటలోనే అడుగులు నావి...

**అక్షరాలు కూడా ధన్యమవుతాయ్, ఆడపిల్ల అందాల్ని ఆరా తీస్తూ, ఆరాధిస్తూ! సున్నితమైన స్నేహంలో సునిశితమైన భావాల్ని ప్రస్తారం చేస్తూ! ఆ అక్షరాల్ని అర్థం చేసుకోవడంలోనే జీవితమూ ధన్యమవుతుంది**

అర్థరహిత దురాశో కదూ.


జీవితంలో దార్శనికమైంది ఏంటో? ఏ మహోన్నతమైన, పరమమైన, సుందరమైన విషయాల్ని, వస్తువుల్ని దక్కించుకోవడానికి మనసెందుకు వెంపర్లాడుతుందో తెలీదు కదూ. నిరంతరాన్వేషణలోనే యౌవనం దాటి వృద్ధాప్యానికి చేరుకుంటాం. వెనకా ముందూ ఏమీ ఉండదు. చావు మాత్రం సత్యమైందిగా నిలుస్తుంది. ఏమిటీ వేదాంతం అని ఆశ్చర్యపోతున్నావా? నాకు ప్రేమమయమైన జీవితం అంటూ ఏమీ లేదు. ఒంటినిండా సూదులు గుచ్చుకున్నాయంతే. ఇప్పుడు లోపల్నించి శూలాలు. పదేళ్ళుగా సూదులతో బాధ పడ్డా పగలూ, రేయి. అది ఇందులేఖ. అయిదేళ్ళుగా శూలాలు. అది భ్రమర.


నీకిలా ఉత్తరం రాయడం ఆనందంగా ఉంది. ఒంటరితనం, నిస్తేజమైన జీవితం చాలా చాలా బాధిస్తున్నాయి. అందమైన చిగురుటూహల్ని, మనసుని ఎవరికి చెప్పుకోను? కేవలం నువ్వొక్కదానివే అర్థం చేసుకోగలవు. ఒక చల్లని స్పర్శ కోసం, ఒక తీయని మాట కోసం ఈ గుండె ఎలా కొట్టుకుంటోందో చెప్పలేను. ఏమిటో జీవితం అర్థరహితంగా ముగిసినట్లుంది. ఎటు చూసినా ఏమీ లేదు. అంతా అందినట్లే ఉంటుంది. ఏదీ దొరకదు. నీలో ఉంది గనకే నిన్ను ఆరాధిస్తాను. వివాహితను ప్రేమించరాదా? ఆంక్షలా? నిషేధాలా?

ఏమో? ఒక్కోసారి నువ్వు ఊహలాగే కనిపిస్తావు. నిజం కాదేమో అనిపిస్తావు. నిన్ను ఒకసారి చూడాలని ఆరాటం. ఎలా రాస్తున్నాను? ఫ్రెండ్‌కు రాసినట్లే కదూ? నీ విషయంలో నేనింతకంటే ఇంకోలా రాయలేనులే. నన్ను వదిలెయ్. ఇలా రాయనీ... నా స్నేహమీ, ప్రేమవీ అన్నీ నువ్వే. అందుకే దాచుకునేది ఏదీ లేదు. అన్నీ నీ పాదాల ముందు పరుస్తా. నాలోని ఉద్వేగాల్ని, ఆలోచనల్నీ నీకు చెబుతా. టక్‌రాదో! యా ప్యార్ కరో! నీ ఇష్టం.

హృదయకమలం విచ్చుకోకూడదు. విచ్చుకున్నాకా దాన్ని మూయడం ఎవరి తరం? నీకో సంగతి చెప్పనా? ఇందులేఖ ఇంకా అప్పటి రూపులోనే నా కలల్లోకి వస్తోంది. ఆ కలలు మానిపోవాలని రోజంతా ఆలోచిస్తా. ఎవరి మనసైనా సముద్రమే కదూ! కొంత లోతు వరకే మనం చూడగలం. అయినా, అందర్నీ చూడాలనిపిస్తుందా చెప్పు. కొందర్ని చూస్తే 'ఏమున్నది రాత్రి వద్ద, అంధకార మొకటి వినా' అనిపిస్తుంది. మన దగ్గర తీసుకోవడానికే కాదు, ఇవ్వడానికి కూడా సంపదలుండాలి కదూ!

అంతా వెలితిగా ఉంది. చల్లని సాయంత్రాలు





హృదయం కొట్టుకోదు. గడ్డకట్టినట్లుంది. పగిలిన అద్దం ముక్కల్లా గది నిండా జ్ఞాపకాలు. అరుపులు, పెడబొబ్బలు, హాహాకారాలు మది నిండా ఉన్నాయి కానీ, గొంతు దాటవు. నువ్వొకసారి కనిపిస్తే అంతరాంతరాల్లోని బాధంతా తీసేసినట్లు తేలిక పడుతుంది. నువ్వేమో అస్సలు రావు. నువ్వేం చెప్పినా పరవశించి వినాలనిపిస్తుంది. అలా హిప్నటైజ్ చేస్తావు - మధురమైన గొంతు నుండి జాలువారే తేనెలా!

ప్రజ్ఞా, నీ స్నేహంతో శక్తి తెచ్చుకున్నా, ప్రేమించడం నేర్చుకున్నా. భావుకతని, ఉత్తరాలు నీలా అందంగా రాయడాన్ని, చుట్టూ ఉన్న ప్రకృతి అందాల్ని చూడ్డం నేర్చుకున్నా. ప్రపంచాన్ని పట్టించుకోకుండా ఉండడం, స్నేహమయంగా జీవించడం నేర్చుకుంటున్నా. ఇంకా ఏం కావాలి చెప్పు మనిషికి? ప్రతి మనిషీ నిరంతరం దేనికోసమో వెతుకుతుంటాడు. మండు వేసవిలో చల్లదనం కోసం, కారుమబ్బుల కోసం, చలిలో నులి వెచ్చదనం కోసం, తీరని ప్రేమ కోసం, ప్రేమలో తీయదనం కోసం! ఆ వెదుకులాటలో వెంట నువ్వున్నావనిపించింది. అందుకే హిపోక్రసీ లేకుండా చెప్తున్నాను. నిజానికి నీ గురించి, నా గురించి మనసులో చెడు భావం ఉంచుకుని పైకి అందంగా మాట్లాడొచ్చు. కానీ, నీ దగ్గర నేనలా మాట్లాడలేను. నాకా ధైర్యం లేదు. అందుకే మనసులో ఉన్నది ఉన్నట్లుగా రాస్తున్నా. వెదుకులాట, స్నేహం కోసం పరితాపం తప్పవా? ఎక్కడిదాకా పరుగు? ఎంతకాలం ఈ పరుగు? వెదుకులాట, నైరాశ్యం అన్నీ ఎందుకు? ఎప్పటికి అంతం? ప్రతిదీ ప్రతిఘాతశక్తే. ఏం చేసినా స్నేహం చేయగల స్నిగ్ధ హృదయాలంబనం కోసమే కదూ!

హృదయ సారాన్నంతా పిండి ఒక్క లేఖలో ఇమడ్చగలమా? లేదు కదూ? కానీ, ఒక్కమాటతో గుండెల్ని పిండేయగలం. అదే సున్నితత్వానికి, బండతనానికి ఉన్న వ్యత్యాసం. కొ.కు అంటాడు 'ప్రేమించడానికి ఆత్మత్యాగం, మానసిక ధార్ఢ్యం కావా'లని. ఆ రెండూ నాకు లేవా? ఏమో! నాకు ప్రేమలో సీరియస్‌నెస్ ఉందా, లేదా అని నన్ను నేనే నిలదీసుకుంటాను. సిన్సియారిటీ, సీరియస్‌నెస్ లేనప్పుడు ఫ్రెండ్‌షిప్‌గాని, ప్రేమగానీ దొంగ మాటలే. అందుకే ఇందులేఖని పోగొట్టుకున్నాను. ఈ అనుభవంతో రియలైజ్ అయి ప్రేమామృతాన్ని అందించినా, భ్రమర నాకు నిరాశ మిగిలించింది. భర్తగా, తన కొడుక్కి తండ్రినని కూడా చూడకుండా నన్ను తిరస్కరించింది. అదే ఆడపిల్ల అయివుంటే, పుట్టిపోయిన కూతురు బతికే ఉంటే దాని భవిష్యత్ కోసమైనా తగ్గివుండేదా? ఏమో?

నిద్రలేమి అలవాటైపోయింది. కొన్నిసార్లు అదృష్టంగా భావిస్తాను. నిశ్శబ్ద రాత్రులు చాలా అందంగా ఉంటాయి. ఏదో స్నేహసాంద్రత, దగ్గరితనం చీకటి రాత్రుల్లో నిక్షిప్తమైన భావన! చెడూ, మంచి, దూరం, దగ్గర- ఏదీ తెలీని అమాయకపు పాపాయిలా ఉంటుంది కదూ అమావాస్య. గాలి మోసుకు వచ్చే బాసలు, భావాలు, చీకటి మౌన ప్రదర్శన- ఇవన్నీ నా హృదయం మీద ఆవిష్కృతమై తన్మయత్వంలో ముంచుతాయి. ఈ హృదయం ఎందుకిలా, దేనికోసమో పదేపదే కొట్టుకుంటుంది. మనిషిని నిర్వీర్యుణ్ణి చేసి శరీరం మీద, నవనాడుల మీద పెత్తనం చలాయించి చివరికి తన బానిసగా చేసుకుంటుంది. క్షీరాబ్ధిని జాగీరుగా ఇస్తే చింతపండు వేసి విరగ్గొట్టినట్లయింది బతుకు.

ప్రజ్ఞా, నిన్ను గురించే ఆలోచిస్తూ పడుకున్నానేమో, నిజంగా నువ్వు కలలోకి వచ్చావు. మేఘమాలికల కోక చుట్టుకున్నట్లుగా, చుక్కల్ని తలలో పూలుగా పెట్టుకున్నట్లుగా? ఆ రమణీయతని ఏ చిత్రకారుడూ చిత్రించలేడు. నీ చుట్టూ నక్షత్రాల రజను రాగరంజిత రమ్య సంధ్య ఎంత బాగుందో, కరుణశ్రీ సాంధ్యశ్రీలా! నేనో గొప్ప చిత్రకారుణ్ణి అయినప్పుడు మాత్రమే ఆ శోభనీ, దాన్లో నిన్నూ చిత్రించగలను. రేఖల్లోనో, రంగుల్లోనో ఆ లాలిత్యాన్ని, ఆ వెలుగునీ, ఆ సమ్మోహనపు బరువునీ, ఒయ్యారపు సింగారాన్నీ, నీ నవ్వునీ, నడకనీ చిత్రించలేం. నిజానికి అది కలేనా? లేక నేను మెలకువగా ఉండి ఊహిస్తున్నానో తెలీదు. లేలేత ఇరులలో నీవు జలకాలాడి తారల పేరోలగంలో తలారబెట్టుకుంటున్నట్టు తల నుండి జారి పడుతున్న నీటిబొట్ల లాంటి చీకట్లు! చీకటికీ చీకటికీ మధ్య వెలుగురేఖ! పారిజాతాలు, కలువ మొగ్గలు, మహా వృక్షాలు, పర్వతాలు, లోయలు, తారలు, మేఘాలు- ఎన్ని సౌందర్యాలు దర్శించానో? నేనెక్కడా వినని మధుర గంధర్వగానం వినిపిస్తోంది. సంగీత ఝరి నన్ను నిద్రలేపింది. కల కూడా ఎంత మోహనంగా ఉంది కదూ!

నీవు పాట పాడితే ప్రపంచాన్ని మరిచి వినాలని ఉంది. ప్రజ్ఞా, నాకోసమే పాడాలి. 'చలిగాలి వీచింది. తెలవారబోతోంది. ఇకనైన ఇలు చేరవా... ప్రియా...' బాలసరస్వతి పాట. స్త్రీలే కాదు, పురుషులు కూడా పాడుకోవచ్చు కదూ ఈ పాట. నువ్వు నా దానివి. ఎందుకు ప్రేమిస్తున్నానో తెలీదుగానీ ప్రేమిస్తున్నాను. నీ కోకిల కంఠం వినాలని, నీతో మాట్లాడాలని, నీతో గడపాలని ఉంటుంది. నిజం! నిన్ను ఎత్తుకుపోతానేమో! నవ్వుతున్నావు కదూ! నవ్వు నవ్వు. నవ్వులరాణివి నువ్వు.

ఈ ఒంటరితనం నుంచి ఎప్పుడు బైటపడతానో ఏమో! నీలి మేఘాలు చిరు ముత్యాల్ని రాలుస్తున్నాయి. పక్కన నువ్వుంటే బావుండుననిపిస్తోంది. ఎంజాయ్ చేస్తావుగా వాన చినుకుల్ని. ఆషాఢ పౌర్ణమి కంటికి కనిపించదుగానీ ఎంత హాయిగా ఉంటుందో! టాగూర్ ఈ కాలపు పౌర్ణమి గురించి చాలా చక్కగా రాశాడు. చదివావు కదూ. ప్రకృతిని ప్రేమించేవాళ్ళంతా 'కాదళన్'లే!

ఒంటరితనపు ఆవేదనలో ప్రతి కన్నూ, ప్రతి పెదవీ నాదేనేమోనని భ్రమ. అద్దాల గదిలో అన్ని ప్రతిబింబాలూ మనవిగానే ఉంటాయి. ఒంటరితనంలో కొట్టుకుపోతున్న నేను ఏ చిన్న గడ్డి పరకైనా ఆసరాగా ఉంటుందని వెర్రిగా భ్రమిస్తున్నాను. మనసు విప్పుకునే అవకాశం లేక, ఆలోచనలు పంచుకునే హృదయం లేక ప్రేమ రాహిత్యంలో బతకవలసిరావడం, నేను ఆనందంగానే ఉన్నానని లోకాన్ని మభ్య పెట్టవలసిరావడం ఎంత దుర్భర వాస్తవం. ఈ చల్లగాలి ఎందుకిలా నన్ను దహిస్తోంది?

ఒక మంచి స్నేహితురాలే కాదు, అద్భుతమైన ఓ స్త్రీ కూడా ఉంది నీలో. అందుకే నిన్ను ఊహల్లో అంతగా ప్రేమిస్తున్నాను.

ఆకాశం నీలాంబరి అయింది. చుక్కల కన్నె ఒక్కొక్కతే విహారానికి వస్తోంది. ఈ రాత్రి ఇలాగే గడిచిపోతుంది. చుక్కలు విశీర్ణిల్లి, భగ్న విరాళులై ఉదయాన్నే నిష్క్రమిస్తాయి నాలాగే. నీకేం నువ్వు హాయిగా, మహారాజ్ఞిలా జీవితపు ప్రతిక్షణాన్ని మధురాతిమధురంగా మార్చుకుని ఆనందాన్ని ఆస్వాదిస్తున్నావు. స్త్రీ స్త్రీలాగే ఉండాలి నీలా. నువ్వింత సంపూర్ణ మానవిగా, స్త్రీగా ఎలా తయారయ్యావ్? ఏ ఆనంద నయాగరాల్లో స్నానమాడుతున్నావో చెప్పవూ? నీలో గొప్ప భావుకత ఉంది. అర్థం చేసుకునే హృదయం ఉంది. పొగడ్త కాదు. స్నేహం చిక్కబడే కొద్దీ ఇంకా దగ్గర చేరాలనిపించే ఏదో దివ్యమైన, అమోఘమైన ఆకర్షణ ఉంది నీ దగ్గర. ఇంకో పదేళ్ళ ముందే మనమింతగా మిత్రులమయి ఉంటే బావుండేదనిపిస్తోంది. నీ సాహచర్యం చాలా కోల్పోయాను. ఇప్పటికైనా నీలాంటి మంచి ఫ్రెండ్ దొరికినందుకు ఐ యాం లక్కీ. నువ్వు స్వప్నంలా, మేఘంలా, మెరుపులా ఉంటావు. వేధించే మిత్రుడిగా, లేదా నీ మనసునీ, నీ స్త్రీత్వాన్ని ఆరాధించే ప్రేమికుడిగా నన్ను చిత్రించుకో, నీ ఇష్టం. స్నేహితురాలిగా, మంచి మనసున్నదానివిగా నన్ను నువ్వెలా భావిస్తే అలాగే అనుకో.

బాగా నిద్రొస్తోంది. తీరా పడుకుంటే తేలిపోతుంది. నువ్వు నాకోసం ఒక పాట పాడి వినిపించవూ! నీ గొంతులో వీణలున్నాయేమో!

కోకిలా ఎప్పుడు పాడతావు నా కోసం? మైనా ఏదీ నీ స్వరఝరి! ఏదీ ఒక్కసారి పెదవి కదుపు. విని ఎన్నేళ్ళయిందో! మనమంతా నాగార్జునసాగర్ వెళ్ళినప్పుడు ఎత్తిపోతల జలపాతం పక్కన నీ గానామృతం జాలువారింది. *మాట్లాడని మెల్లెమొగ్గ మాదిరిగా నడచిరా... నిశ్శబ్దం ఎరుగనట్టి నిమ్నగ వలె గడచిపో...!* ఓహ్ ఎంత సౌందర్యాతిశయం ఉన్న అపురూప భావన! నీ స్వరధారల్లో తడిసి ముద్దయిన ఆ అక్షరాలు ఎంత ధన్యమయ్యాయి. అక్షరాల పల్లకీ అల్లి, అక్షర లక్షలిచ్చి అందులో నిన్ను కూర్చోబెట్టాలని ఉంది. రాసినప్పుడు దాశరథి కూడా అనుకుని ఉండడు తన గీతం నీ గొంతులో అమృతత్వం సంతరించుకుంటుందని.

ప్రజ్ఞా, నీకిలా ఎంతయినా రాయాలనిపిస్తోంది. కోమల ఊహల పల్లకిలో విహరించినట్లుగా ఉంది. నా నుండి నేను తప్పించుకునే ప్రయత్నంలో కూడా భ్రమర, ఇందు నా వెంటే ఉన్న భ్రమ. భ్రమరతో మాట్లాడితే ఎడారిలో నడిచినట్లుండేది. ఒయాసిస్సులు కాదు, కనీసం ఎండమావులు కూడా కనిపించేవి కావు. ఇంక మేఘాలు, పచ్చదనపు శోభ ఏముంటాయి?

నీతో గాక ఎవరితో చెప్పుకోను. ప్రపంచం దృష్టిలో నేను ఆకాశంలో ఉన్నాను. నా అంత అదృష్టవంతుడు ఇలలో లేడని అభిప్రాయం. కానీ, వాళ్ళకేం తెలుసు నేనెంత బద్ నసీబ్‌నో! భ్రమరతో పెళ్ళి మిధ్యగా మిగిలింది. పాప పుట్టి పోయింది. బాబుని కూడా నాకు దూరం చేసింది. భ్రమరతో నిశ్చితార్థం అయ్యాక ఇందుని ఊహా మాత్రంగా కూడా మనసులోకి రానివ్వలేదు. ఉన్నత హోదాలో ఉన్న నాకు దేన్ని గురించీ ఆలోచించే తీరిక ఉండేది కాదు. ఏ కాస్త సమయం చిక్కినా భ్రమర కోసం, ఆ తర్వాత బాబు కోసం. ఎందుకో తెలీదు నన్ను తొలి నుండీ ఆమె మనఃస్ఫూర్తిగా తనవాణ్ణిగా స్వీకరించలేదు. పురుషాధిక్యత లేని అనురాగం ఆమెకి హాలాహలమైందేమో! ఆ సమయంలో మాత్రం ఒక్క చల్లని చినుకూ నా పై వర్షించ లేదు. ఏవేవో ఊహించుకుని, కల్పించుకుని జీవితం దుర్భరం చేసింది. తన మాట తనదే గాని మన మాట వినదు. అందరికీ నేనేంటో తెలుసు గనక నా గౌరవం నిలబడింది. బాబు కౌశిక్ అంటే నాకు ప్రాణం. నాకు వాడు కావాలి. వాడితో గడిపే కాసేపూ ఎంత హాయిగా ఉంటుందో! 'చిట్టీ పొట్టీ వరాల మూట' నా మెడ చుట్టూ చేతులేసి బుజ్జి బుజ్జి కబుర్లు చెబుతుంటే నా బంగారు తండ్రి కళ్ళల్లోకి అలాగే చూస్తూ కన్ను మూయాలనిపించేది. ఇప్పుడు నేను అందుకు కూడా నోచుకోలేదు. కౌశిక్‌తో బ్రిస్టల్ వెళ్ళిపోయింది భ్రమర.

ఒక్కసారి తల నిమిరే స్నేహహస్తం కోసం గుండెలు మండి మసి అయిపోతున్నాయి. జీవితాన్ని చేజేతులా ఆహుతి చేసుకుని వెనక్కి తిరిగి చూస్తే ఏమీ మిగలదు. ఎక్కడ కదిలించినా గులకరాళ్ళు, తుమ్మ ముళ్ళే! గ్రీష్మంలో సేదదీర్చుకునేందుకు వృక్షచ్ఛాయ చాలు. ప్రజ్ఞా, నీ స్నేహం గాయపడిన నా జీవితాన మహా వటవృక్షచ్ఛాయే! హృదయాంతరాళాల్లో మెత్తని పొరల మధ్య అపురూపంగా దాచుకున్న నెమలి ఈకలాంటి సుందరమైన అక్షరాల్ని ఒక్కొక్కటీ వెలికి తీసి పిల్లగాలికి కడిగి నీకు జాబు లిఖించాలని ఉంది. అది సాధ్యమో, కాదో గాని ఒక్కొక్కసారి అనిపిస్తుంది ఈ అక్షరాలు ఎంత సౌందర్యభరితాలో కదా! అదీ నీకు రాస్తున్నప్పుడు మరీ. ప్రజ్ఞా, అర్థం అవుతున్నానా?

రాత్రి కలలో కాలికి మువ్వలు కట్టుకుని వచ్చావు. నీ వెనక కంజీరాలు మీటుతూ ఎవరెవరో! పాడుతూ, ఆడుతూ నువ్వు పల్లవి అందుకున్నావు. మిగతా అంతా నిశ్శబ్దం. నీ కంఠం మరీ మంజీర రవళిలా ఉంది. నీ మ్యూజికల్ వాయిస్‌ని దోచుకోవాలనిపిస్తుంది. నీ పాట పల్లవితో నాకు మెలకువ వచ్చింది. తెల్లవారుజాము దాకా రఫీ పాటలు వింటూ కూర్చున్నాను. 'నీ శిల్పం నా మదిలో పాతుకు పోయింది. నీ నీలి కురుల మాటున నా భవిష్యత్తు చిక్కుకుంది' అన్న కవి భావం రఫీ గొంతులో ఎంత బావుంటుందో కదూ! పాటలో లాగే నువ్వూ బేవఫావి. నిన్ను ఎత్తుకుపోతే ఏం చేస్తావ్? ఊహలన్నీ మేఘాల స్పర్శతో స్పందించే స్వప్నాలయి వస్తే ఏం చేయను? ఆ ప్రేమను ఎక్కడ పారబోయను? ఎవరికివ్వను? మనసుల్నీ, వాటిలో చెలరేగే తుపానుల్నీ సున్నితంగా తెలుపుకోలేనిది ఎందుకీ ప్రేమ? ఒక ఆత్మకోసం, ఒక తుషారం కోసం గాలిలో గాలాలు వేసి వెతుకుతున్నానీ రాత్రి!

ప్రేమ రాహిత్య నిస్సార ఎడారి జీవితాన నీరవ నిశీధిలో ఎన్ని వెన్నెల రాత్రులు ముక్కలు ముక్కలై చిట్లిపోతున్నాయో ఎవరికి చెప్పను నీకు గాక? నాకు అమితానందం కలిగినా, భార దుఃఖం కలిగినా నీకు రాస్తున్నాను. తద్వారా కాస్త తేలిక పడుతున్నాను. ఐ యాం వెరీ వెరీ లక్కీ టు హావ్ యు. అప్పుడప్పుడూ అనేక రాత్రీ పగళ్ళు నన్నావి నీ ఊహలతో చెలిమి చేసే నా భావనా ప్రకంపనలివి. మారు పలుకుతావు కదూ! ఇలా

> హృదయాంతరాళాల్లో దాచుకున్న సుందరమైన అక్షరాల్ని ఒక్కొక్కటీ వెలికి తీసి పిల్లగాలికి కడిగి నీకు జాబు లిఖించాలని ఉంది.

రాసి నీ స్నేహం పోగొట్టుకుంటానేమో అని ఒక్కోసారి భయంగా ఉంటుంది. రాయకుండా ఉండడం నావల్ల కాదేమో! ఈ అయిదేళ్ళూ ఉద్యోగ రీత్యా ఇండియాలోని ప్రధాన నగరాల చుట్టూ ప్రదక్షిణలు, ఇకపై దేశాలు పట్టిపోయే పరిస్థితి! ప్చ్. అందుకే నిన్ను చాలా ఆలస్యంగా చాలా కాలానికి చూడగలిగాను. చాలా పెద్ద ఉత్తరం రాశాను కదూ! అందుకే కొరియర్లో పంపుతున్నా. ఉండనా! ఉండాలని లేదు. కానీ, తప్పదుగా!

*'ప్యార్ నహీ తో ఇంత్‌జార్ నహీ! అగర్ ఇంత్ జార్ నహీ తో మిలాప్ నహీ!...'*

బై...
ప్రణవ్.

డియర్ ప్రణవ్,

ఊహల రెక్కలు కట్టుకుని, మబ్బుల తేరునెక్కి భావాంబర వీధుల్లో విహరించే కలల బేహారీ ఓసారి భువికి దిగి రావోయీ! చాలా రోజుల తర్వాత నీ లేఖ - చిత్రంగా ఉంది.

స్పందన అనేది ఎంతో సుందరమైన పదం. నీ హృదయస్పందన హృద్యమే గాక సురభిళం కూడా! స్నేహానికి మంచితనం అనే ఎడ్‌హెసివ్ జోడిస్తే అది మహా స్ట్రాంగ్. అలాంటి మంచితనపు పునాదుల మీదున్న మన స్నేహం ఎప్పటికీ అలాగే ఉండాలి. ప్రేమ భాషణలు, ప్రశంసలు, వర్ణనల మత్తులో మునిగిపోరాదు. మిత్రుల పలకరింపు కాస్త ఆలస్యమయితే మనసులో ఓ విధమైన ఎమ్టీనెస్ ఏర్పడుతుంది కదూ! ఆ ఖాళీలను మెల్లగా, చల్లగా పూరిస్తూ నీ పలకరింపు. అధిగమించనలవిగాని ఉద్యోగ ధర్మాలు. అందుకే దూరాలు! అడపాదడపా నీ వార్తలు తెలుస్తున్నా ఈ మధ్యలో తీరిగ్గా మాట్లాడే సావకాశం దొరకలేదు. పిల్లల చదువులు, శ్రీవారి ముచ్చట్లు.

నీ ఉత్తరం నీ గురించి అంతా చెప్పింది. ఆకాశంలో ఎగిరే నీ ఊహల పక్షులు అక్షరాలై కాగితం మీద వాలాయేమో అనిపిస్తోంది. చాలా రసప్లావితంగా, భావావేశం ఉప్పొంగుతూ ప్రేమార్ద్రత తొణికిసలాడుతోంది. లేఖ ఆద్యంతం స్నేహఝరిలా ఉంది. అక్షరాలు అలవోకగా పలకరిస్తూనే పెదవులపై చిరునవ్వులద్ది, చేయి పట్టి మైత్రీవనంలో పరుగులు పెట్టించిన భావన!

నీ కాంప్లిమెంట్స్ అన్నీ నిజమే, కాదనను. కానీ ప్రణవ్, నువ్వు నా ఎక్స్ కొలీగ్‌వి. నా స్నేహితుడివి. అంతే. కానీ ఓ ప్రేమికునిలా, అదీ ఓ వీర ప్రేమికునిలా దివ్యత్వాన్ని, రాజ్ఞిత్వాన్ని ఆపాదిస్తూ ప్రియురాలిని అర్చించే అద్భుత ఆరాధకునిలా రాయాలని ఉందా చెప్పు? టు బి ఫ్రాంక్ ఇనఫ్! ఆ అక్షరాలు ఎంత సమ్మోహన పరుస్తాయంటే, రాసిన వ్యక్తి ఫలానా అని గుర్తు లేకుండా క్షణకాలం హృదయం లయ తప్పేంతగా. అందుకే కోపం వస్తుంది. ఇకపై ఒక ఫ్రెండ్‌లాగే రాయి, సరేనా! లేకపోతే ఇలాగే రాస్తే ఆ మానసిక స్థితిని ఏమంటారో తెలుసా? ఇంగ్లీష్‌లో పర్‌వర్షన్ అనీ, తెలుగులో సరియైన మార్గమును తప్పిపోవుట అని. అర్థం అయిందా? మూర్తీభవించిన నీ అనురాగార్ణవాన్ని నీ భావి జీవన సహచరి కోసం నీ హృదయపు లోతుల్లో భద్రపరుచు. ఏఏ తీరాలు దాటి రావాలో ఆ అదృష్టవంతురాలు.

అవునూ! నా గొంతును దొంగిలిస్తే ఎలా? నీ గొంతులోని గాంభీర్యం డైల్యూట్ అయిపోదూ? ఏమో! అందరూ అంటారుగానీ నా స్వరమధురిమ గురించి నాకంతగా తెలీదు. ఇవన్నీ వింటుంటే అనిపిస్తోంది నా వాయిస్‌ని రికార్డు చేసుకుని మగవాడిన్నై వినాలని, ఏ బాపూ రొమాంటిక్ హీరోయిన్‌కో నా హీరోయిన్ వాయిస్ అరువివ్వాలని. నిజం కదూ! కొన్ని కొన్ని మాటలు పదేపదే వింటుంటే ఇలాంటి పిచ్చి పిచ్చి ఆలోచనలే వస్తుంటాయి.

ఆత్మాశ్రయ అభిమానాలు, అనవరతం వికసించే స్నేహసుమాలు, స్నేహసౌరభాలు, అవిరళ అనురాగ స్పందనల్ని అందించింది నీ లేఖ. అందరూ కళ్ళతో చూస్తారు. కొందరు మాత్రమే హృదయంతో చూడగలరు. నీ పారదర్శక భావాలను నేనెప్పుడూ హర్టింగ్‌గా అనుకోలేదు. నేను వింటానని, నీ ఫీలింగ్స్‌ని, బాధని అర్థం చేసుకోగలనని రాశావనీ నాకు తెలుసు. ఎంతయినా నీ భావాలు సున్నితమైనవి. సున్నితత్వంలో ప్రగాఢత ఉంటుంది. దగ్గర, దూరం అన్నది ఓ భావన మాత్రమే. మధ్యలో దూరం వెంట్రుకలో వెయ్యోవంతు. అర్థం చేసుకుంటే సింప్లీ నథింగ్. సంతోషానికైనా, బాధకైనా ఔట్‌లెట్ ఉండాలి.

నా స్నేహం పోగొట్టుకోవడం ఏమిటి? నేను ఎప్పుడూ నీకు మంచి మనసున్న ఫ్రెండ్‌నే. నువ్వే పిచ్చివాడిలా ఏదో అనుకుంటావ్. ఇంకేదో భ్రమపడి మారిపోయాను. దూరమైపోయానను కుంటావు. ఓ మాట చెప్పనా? చాలా సార్లు చెప్పాను. మళ్ళీ చెబుతున్నాను. నేను అందరితో స్నేహం చేయను. స్నేహంగా ఉంటానంతే. అపార్థాలు, మనసులు మార్చుకోవడాలు నాకు చిరాకు. ఇంక చాలుగానీ ఇకపై ఇలాంటి మ్యాడ్ మ్యాడ్ రాతలు మానెయ్.

(ముగింపు వచ్చే సంచికలో)